సంతలకు తగ్గని క్రేజ్



యాదవజగ్గరాజుపేటలో నిర్వహిస్తున్న సంత

మాల్స్ వచ్చినా.. ఆన్‌లైన్‌లో ఇంటికి చేరినా

వారపు సంతలకు ఆదరణ

వేధిస్తున్న సదుపాయాల లేమి

రోడ్ల వెంబడి నిర్వహణతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఒకప్పుడు అవన్నీ శివారు ప్రాంతాలు.. జన సంచారం అంతంతమాత్రమే.. సాంకేతిక పరిజ్ఞానం.. దుకాణాలు.. ఆన్‌లైన్ మార్కెటింగ్ అందుబాటులో లేని రోజులు.. ఆ సమయంలో ప్రజలకు అవసరమ్యే వస్తువులు కొనుగోలు చేయడానికి సంతలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నగరం విస్తరించింది. కాంక్రీట్ జంగిల్‌గా మారింది. అయినా అలవాటు ప్రకారం ఆ ప్రాంతాల్లోనే వారపు సంతలు నిర్వహిస్తున్నారు. ఎన్నిమాల్స్ వచ్చినా సంతలకు మాత్రం క్రేజ్ తగ్గలేదు. కాకపోతే వసతుల లేమితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.

కూర్మన్నపాలెం: ఆధునిక ప్రపంచంలో అన్నీ ఇంటి ముందుకు వస్తున్నాయి. ఏ వస్తువు కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే క్షణంలో వాలిపోతున్నాయి. అయినప్పటికీ పూర్వీకులు ఏ సదుపాయాలు లేని సమయంలో ఏర్పాటు చేసిన సంతలకు క్రేజ్ తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి తట్టలు, తోపుడు బళ్ల ఇతర సాధనాలతో చిరు వ్యాపారులు తెచ్చే సరకులు విరివిగా అమ్ముడుపోతున్నాయి. వారం వారం నిర్వహించే ఈ సంతలకు పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళలు చేరుకొని కావాల్సిన సరకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో సంత రోజుల్లో ఆయా ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి.

అందుబాటు ధరల్లో...

సంతల్లో తాజా కూరగాయలు లభిస్తాయి. రైతులు, గ్రామీణ ప్రాంతాల నుంచి చిరువ్యాపారులు రావడంతో వంట సామగ్రి, చీపుర్లు, ఇతర గృహ సామగ్రి విక్రయిస్తారు. దీంతో సరకులు చౌకగా లభిస్తాయని ప్రజలకు విశ్వాసం ఉంది. అందువల్లే మాళ్లు వచ్చినా.. ఆన్‌లైన్ షాపింగ్ ఉన్నా సంతలకు మరింత గిరాకీ పెరుగుతోంది.

కానరాని వసతులు

జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లో వారపు సంతలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ నగరీకరణకు ముందు ఏర్పాటు చేసినవే. అయితే ఇప్పుడు అందుకు తగ్గట్టు సదుపాయాలు లేకపోవడంతో చిరు వ్యాపారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసీలు వసూలు చేస్తున్న అధికారులు వసతులు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారు. ఇందుకు కూర్మన్నపాలెం సమీపంలోని యాదవ జగ్గరాజుపేట,కణితి కాలనీల్లో వారం వారం ఏర్పాటు చేసే సంతలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రతి గురువారం యాదవజగ్గరాజుపేటలో సంత నిర్వహిస్తారు. ఈ సంతకు ఇటు గాజువాక పరిసర ప్రాంతాల నుంచి అటు అనకాపల్లి, సబ్బవరం, రూరల్ ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు మూటలు మోసుకుంటూ సంతలకు చేరుకొని అమ్మకాలు సాగిస్తారు. ప్రధానంగా తాజా కూరగాయలు తెస్తుండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. యాదవజగ్గరాజపేటకు చుట్టూఉన్న గ్రీన్‌సిటీ,పకీర్ తక్యా, తుంగ్లాం, కాపుజగ్గరాజుపేట, చాకటిపేట,ఉక్కు నిర్వాసితకాలనీల నుంచి అధిక సంఖ్యలో మహిళలు సంతలకు వచ్చి కావాల్సిన సరకులు కొనుగోలు చేస్తారు. ఆటోనగర్‌లోని పరిశ్రమల్లో కార్మికులు, వారి కుటుంబాలు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా నివాసాలు ఉండడం వల్ల వారంతా సంతలపై ఆధారపడుతుంటారు. అటువంటి ప్రాముఖ్యత కలిగిన సంతల్లో సదుపాయాలు లేక పోవడం వల్ల ఎండైనా వానైనా అయినా భరించాల్సిన పరిస్థితి నెలకొంది.

ట్రాఫిక్ ఇబ్బందులు



రోడ్డుపైనే దుకాణాలు పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఒక్కోసారి దుకాణాలు రోడ్డు పైకి చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. సాయంత్రం వేళల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. ప్రతి శుక్రవారం నిర్వహించే కణితి కాలనీ సంతకు కూడా ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశాలమైన స్థలం లేక రహదారినే వ్యాపారులు ఆశ్రయించక తప్పటం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి సంతలకు సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



సంతల్లో విరివిగా వ్యాపారం జరుగుతుంది. అయితే వ్యాపారులకు తగిన సదుపాయలు లేకపోవడం ఇబ్బందిగానే ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా యాదవజగ్గరాజుపేట సంతబైయిలను చదునుచేశాం. దీని వల్ల రోడ్డుపై దుకాణాలు తగ్గాయి.

– బొడ్డ గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు

రోడ్డుమీదే సంత



శుక్రవారం సంత రోడ్డుమీదే సాగుతుంది. అక్కడకు ప్రజలు ఎక్కువగా వస్తూనే ఉన్నారు. దీని వల్ల సమస్యలు ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయం కనిపించడంలేదు. కూరగాయలు కొనుగోలు చేయాలంటే సంత తప్పితే వేరే దిక్కులేదు. కాకపోతే ట్రాఫిక్ సమస్య ఉంటుంది.

– పి.ఆనందకుమార్, గణేష్‌నగర్ వాసి

తాజా కూరగాయలు లభ్యం



సంతల్లో తాజా కూరగాయలు లభ్యమవుతున్నాయి. రైతులు నేరుగా రావడంతో రేట్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. వాటాల రూపంలో తక్కువ ధర పెట్టడం వల్ల కొనుగోలుకు వీలు ఉంటుంది. సదుపాయాలు కల్పిస్తే సంతలకు మరింత డిమాండ్ పెరుగుతుంది.

– దివ్యభారతి, కణితికాలనీ, వడ్లపూడి

క్లుప్తంగా

బోయమాంబ.. చల్లగ చూడమ్మా



ప్రత్యేక అలకంరణలో బోయమాంబ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సెక్టార్ -1 పునరావాస కాలనీలు పినమడక, కొత్తూరు, పూడివానిపాలెం, కర్రివానిపాలెం గ్రామాల ఇలవేల్పు బోయ మాంబ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా జరిపించారు.తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.సాయంత్రం అమ్మవారిని భారీ బాణ సంచా, సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ ఊరేగింపు చేశారు. ఆలయ, ఉత్సవ కమిటీలు, గ్రామ పెద్దల పర్యవేక్షణలో ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.


ఘనంగా పైడిమాంబ మారువారం



పైడిమాంబ అమ్మవారు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి మారు వారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

హడలెత్తిస్తున్న ఎద్దు



దువ్వాడ సెక్టార్-1లో కాలనీలో సంచరిస్తున్న ఎద్దు

అగనంపూడి: ఆ గిత్త... ఎదురుగా వస్తే ఆమడ దూరం పరిగెత్తాల్సిందే.. తెలియక పక్క నుంచి వెళ్తే జులుం ప్రదర్శిస్తుంది. గాయాలపాల్జేస్తుంది. దువ్వాడ సెక్టార్-1 కాలనీలో కొద్ది రోజులుగా ఒక ఎద్దు సంచరిస్తుంది. ఎవరు వదిలి వెళ్లారో తెలియదు కాని అటువైపు ఎదురుగా వెళ్లినా, పొరపాటున పక్క నుంచి వెళ్లినా అది కొమ్ములతో విసిరి పడేస్తుంది. దీంతో ఈ ఎద్దు కనపడితే హడలిపోతున్నారు. ఈవిషయాన్ని జీవీఎంసీ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల్లో ఆరుగుర్ని ఎద్దు గాయపర్చిందని, అయినా ఎవరూ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తిపన్ను వడ్డీలో రాయితీ

గాజువాక: ఈనెల 31లోగా ఆస్తి పన్ను చెల్లించే వారికి వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినట్టు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి తెలిపారు. ఆస్తిపన్ను, ఖాళీజాగా పన్నులను ఏకమొత్తంగా చెల్లించేవారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని కోరారు.

అనురాగానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న పెద్దలు, నాయకులు

అగనంపూడి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు ఆత్మీయత, అనురాగం, మత సామర్యాలకు ప్రతీకగా నిలుస్తుందని అగనంపూడి మసీద్ ఈ అబూబకర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మీరా మొహిద్దీన్ బాషా అన్నారు. అగనంపూడిలోని మసీద్ ఈ అబూబకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలకు అతీతంగా ఈ పండగను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు షేక్ అబ్దుల్లా రహీమ్, పల్లీ బాయ్, స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, గోడు గురుమూర్తి, ఫాదర్ కె .మోసెస్ రాజు, మౌలాలి బాయి, హుస్సేన్, మహమ్మద్ రబీ పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న వైద్యాధికారి సాయినాథ్

పెదగంట్యాడ: కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని గంగవరం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయినాథ్ అన్నారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి, సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల గల కిశోర బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అవగాహన లోపం, తల్లిదండ్రుల పర్యవేక్షణ దీనికి ప్రధాన కారణమన్నారు. ఆడపిల్లలకు 20 ఏళ్లు వచ్చే వరకూ వివాహాలు చేయవద్దని కోరారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల వారి ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గమ్మ, శాంతి, దేవుడమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇన్సూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించాలి'

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల గ్రూప్ మెడికల్ ఇన్స్రూ పాలసీ ప్రీమియమ్‌ను సకాలంలో చెల్లించాలని ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు గుదే సుశీలా గజేంద్రరావు, జి.బోసుబాబు బి.భాస్కరరాజు, ఎస్ఎం.రఫీ కోరారు. ఈనెల 27లోగా నగదు చెల్లించని పక్షంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయా కుటుంబాలు ఆరోగ్య బీమా రక్షణ కోల్పోయే పరిస్థితి ఉందని వాపోయారు. ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించి నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీ (జీఎంఐపీ), పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (పీఆర్ఎంఎస్) ప్రీమియం గడువు తేదీ లోగా చెల్లించని పక్షంలో విశ్రాంత ఉద్యోగులకు భారీ నష్టం జరుగుతుందన్నారు. ఈవిషయంలో యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించి ఈనెల 27వ తేదీలోగా ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని వారు కోరారు.

క్యాంపస్ డ్రైవ్‌లో గైస్ విద్యార్థులకు ఉద్యోగాలు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో గుజరాత్‌కు చెందిన నారాయణ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థులను రూ.4.50 లక్షల వార్షిక జీతంతో ఉద్యోగానికి ఎంపిక చేశారని తెలిపారు. వీరిలో పెట్రో కెమికల్ నుంచి ఇద్దరు, కెమికల్ ఇంజినీరింగు నుంచి నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, నారాయణ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ హెచ్ఆర్ హెడ్ అమిత్రజిత్ సేన్ గుప్తా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కంపెనీ టెక్నికల్ హెడ్ రమణ వర్మ, హెచ్ఆర్ మేనేజర్ శ్రీస్తి శుక్ల, గైస్ విభాగాధిపతులు జయప్రకాష్‌రెడ్డి, ప్రశాంత కుమారి, దామోదర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలకు సహకరించినా కఠిన చర్యలు

జిల్లా జడ్జి షణ్ముఖరావు



అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి షణ్ముఖరావు

గాజువాక: బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించే వారితోపాటు వారికి సహకరించినవారిపై కూడా కఠిన చర్యలు తప్పవని 13వ జిల్లా అదనపు జడ్జి జి.షణ్ముఖరావు పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలపట్ల ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే టీచర్లకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పిల్లలు సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. వాటిని ఎప్పుడు, ఏ సమయంలో ఉపయోగించుకోవాలో వివరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వి.వినోద్ కుమార్, ఎంఈవో సునీత తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థి దశలో అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ కృష్ణప్రసాద్

అగనంపూడి: చట్టాలు, న్యాయంపై విద్యార్థి దశలోనే పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గాజువాక అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కృష్ణప్రసాద్ ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అగనంపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలకు లోబడి ప్రతీ మనిషి ప్రవర్తించాలని, విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు గుర్తెరగాలని సూచించారు. అప్పుడే న్యాయ వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈవ్‌టీజింగ్, మానసిక వేదనకు గురిచేసే ఆకతాయిలపై పోక్సో చట్టం బనాయించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. న్యాయ విజ్ఞానంపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోడి రామకృష్ణ, త్రివేణి, దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణవేణి, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదవీ విరమణ అధికారులకు సత్కారం



ఉక్కు కోక్‌ఓవెన్స్ విభాగంలో ఉద్యోగిని సత్కరిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) చేస్తున్న అధికారులను సత్కరించారు. ఈనెలాఖరున 470 మంది పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో మంగళవారం రోల్‌షాప్, కోక్‌ఓవెన్స్, డీఎన్‌డబ్ల్యూ, ఎస్ఎండీ, ఆర్ఎండీ, ప్లాంట్ డిజైన్, పీఈఎం విభాగాల్లో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులను ఆయా విభాగాధిపతులు దుర్గాప్రసాద్, సతీష్ నాయుడు, లక్ష్మీనారాయణ, పాండా, చంద్రశేఖర్ తదితర ఉన్నతాధికారుల సమక్షంలో సీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, నాయకులు నరసింహ, సీహెచ్. వెంకటేశ్వరరావు, సూర్యనారయణ, దాలినాయుడు, రాజా, మల్లికార్జున పాల్గొన్నారు.

● స్టీల్ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో వీఆర్ఎస్ తీసుకుంటున్న కోగంటి లెనిన్‌బాబు, పోట్ల శ్రీనులను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి నమ్మి సింహాద్రి, టి. శ్రీనివాస్, కె. శివ నాగేశ్వరావు పాల్గొన్నారు.

గంగవరం పోర్టును సందర్శించిన డీఆర్ఎం



గంగవరం పోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఉన్నతస్థాయి అధికారుల బృందంతో కలిసి మంగళవారం అదాని గంగవరం పోర్టును సందర్శించారు. పోర్టులో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రాజెక్టులు, కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అదాని గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వ్యాపారాభివృద్ధి కోసం చేపట్టవలసిన విషయాలు, ఇరువురి మధ్య అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించి, రైల్వే అధికారులు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గెడ్డలు, కాలువల మూసివేతపై ఫిర్యాదు

గాజువాక: పోర్టు రోడ్ విస్తరణలో గెడ్డలు, కాలువలను మూసివేయడంపై ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనంతో ఆయా కాలనీల వాసులు అప్రమత్తమయ్యారు. ముంపు ముప్పు తప్పదని గ్రహించారు. దీంతో మంగళవారం పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిశారు. నాలాలు, కాలవులు కప్పేస్తే ఎదురయ్యే ఇబ్బందులపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

ఆరు లైన్ల రహదారి నిర్మాణంలో ఏడు కాలువలను పూర్తిగా మూసివేశారని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అన్ని కాలువలు సక్రమంగా ఉన్న సమయంలోనే వర్షాలు కురిస్తే తమ కాలనీతోపాటు సమీప గ్రామాలైన అక్కిరెడ్డిపాలెం, మింది, ములగాడలలో మోకాళ్ల లోతు నీరు నిలబడిపోతోందని, ఆ నీరు బయటకు పోవడానికి కనీసం రెండు గంటల సమయం పడుతుందని వివరించారు. ఇప్పుడు కాలువలను మూసివేయడం వల్ల వర్షపునీటితోపాటు మేఘాద్రిగెడ్డ నుంచి వచ్చే నీటి ప్రవాహానికి పంచవటితోపాటు షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం కూడా ముంపునకు గురవుతాయని తెలిపారు. దీనిపై తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరారు. ఒకసారి కాలువలను మూసివేస్తే తర్వాత వాటిని గుర్తించడం కూడా కష్టమని పేర్కొన్నారు.

కాగా, ఈ విషయంపై ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకున్నారని, తాము చెప్పిన సమస్యను కూడా వివరించారని పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించినవారిలో అసోసియేషన్ నాయకులు పి.చిన్నారావు, ఎస్.పాండ, వై.రామ్మోహన్, కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న ఆగమ పండితులు

గాజువాక: ఏకాదశి, శ్రవణా నక్షత్రం సందర్భంగా షీలానగర్ ఎస్‌టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మంగళవారం శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి నిర్వహించిన శాంతి కల్యాణంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దివ్యక్షేత్రం ట్రస్టు ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అమోఘం



కార్మికులను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కార్మికులు చేసిన కృషి అమోఘమైనదని యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ అన్నారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి లోని యూనియన్ పాయింట్ వద్ద మంగళవారం ఈనెలఖారున పదవీ విరమణ చేయనున్న, వీఆర్ఎస్ తీసుకున్న కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో చేరిన కార్మికులు అనేక ఆటుపోట్లు ఎదుర్కొని ప్లాంట్‌ను నిలబెట్టారన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గంగా ఉందన్నారు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలు కూడా ఇవ్వకుండా వేధిస్తుందన్నారు. యూనియన్ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న కార్మికులు ఇకపై తమ కుటుంబాల కోసం జీవితం గడపాలని కోరారు. కార్యక్రమంలో బి.ఎస్. రాజు, రమణమూర్తి, కారు రమణ, మద్ది అప్పలరాజురెడ్డి, కొమ్ము ప్రసాద్, ఎన్. వెంకన్న, గొందేశి ప్రభాకరరెడ్డి, ఎన్. రమేష్‌కుమార్, డి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

డాబాగార్డెన్స్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సర్వీస్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వమే నేరుగా ఈ సర్వీస్ నిర్వహించాలని ఎంప్లాయిస్ యూనియన్ (సిటు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జగదాంబ సమీపాన గల సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015 డిసెంబర్ 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఆంధ్ర రాష్ట్రంలో తొలిసారిగా ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో అరబిందో కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్ట్ మార్చి 31తో ముగుస్తుందని, ప్రభుత్వం ఎవరికీ ఈ కాంట్రాక్ట్ ఇవ్వకుండా నేరుగా ఈ సర్వీస్‌ని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. సిటు జిల్లా ఉపాధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, లేబర్ కోడ్స్ రద్దు, సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టాల పటిష్టత అమలుకు మే 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రంగస్థలం వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆవిష్కరించారు. యూనవర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ కేవీ గోపాలస్వామి ఓపెన్ థియేటర్‌లో తులసి తీర్థం నాటిక, అల్లూరి సీతారామరాజు బుర్రకథ, హాస్య గుళికలు వేణుగానం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు తెలిపారు. రంగస్థలం వైభవాన్ని చాటేలా వేడుకలు నిర్వహించాలని వీసీ ఆచార్య రాజశేఖర్ సూచించారు. రంగస్థలం ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ మరపట్ల భాస్కరరావు, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ త్రినాథరావు, పితాని ప్రసాద్, సంబంగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.